గాజువాక అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.1800 కోట్లు వెచ్చించడమే నిదర్శనం
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మక్కువ ఎక్కువ అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకపై ఉన్న మమకారంతోనే రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గానికి రూ.1800 కోట్లు వెచ్చించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తొలినుంచీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ వచ్చినప్పుడు కూడా లక్షలాదిమంది ప్రజల సాక్షిగా ముఖ్యమంత్రి ఆ విషయంపై కుండ బద్దలుగొట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతానికి మహర్దశ వస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్‌ను వదులుకొనే ప్రసక్తే లేదన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాసనసభలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ నేతృత్వంలోని కూటమి పార్టీలు విశాఖకు ద్రోహం చేస్తున్నాయన్నారు. విశాఖకు వ్యతిరేకంగా వస్తున్న కూటమి నేతలను నిలదీయాలని కోరారు. తన పుట్టినిల్లు అయిన విశాఖ ఆడపడుచుగా అందుబాటులో ఉండి పని చేస్తానన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గాజువాకలో గత ఐదేళ్లలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలను ఇచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీకి గాజువాకలో పటిష్టమైన నాయకత్వం ఉందని, అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్తామని అన్నారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బూత్‌స్థాయిలో మంచి ఫలితాలు తీసుకొచ్చినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కుల, మతాలు, ప్రాంతాల తారతమ్యం లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ 130 సార్లు బటన్ నొక్కి బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమాలను అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేసిన బీజేపీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందన్నారు. అలాంటి పార్టీతో టీడీపీ, జనసేన కలిసి పని చేస్తున్నాయని, వారికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ గాజువాక ఎన్నికను పార్టీ శ్రేణులు సవాలుగా తీసుకోవాలన్నారు. అమర్‌నాథ్, బొత్స ఝాన్సీల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఉరుకూటి అప్పారావు, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు దామా సుబ్బారావు, తిప్పల దేవన్‌రెడ్డి, కులుకూరి మంగరాజు, బోగాది సన్ని, గొందేశి మహేశ్వరరెడ్డి, బొడ్డ గోవింద్, మొల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

క్లుప్తంగా

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమారామలింగేశ్వర ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న దేవతా మూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉక్కు ఉద్యోగుల సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్లేటి శ్రీనివాస్, పీవీ రామచంద్రరావు, రాధాకృష్ణ, పి.కాంతారావు, రమేష్‌కుమార్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామ మహోత్సవాలు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 17వ ఆపదుద్ధారక శ్రీరామ మహోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామి చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా స్వామి రఘువీరానంద సమక్షంలో ఉత్సవాలు ఏర్పాటు చేశారు. కూర్మన్నపాలెం , దువ్వాడ స్టేషన్ రహదారిలోని అభిరామ్ టవర్స్ ఎదురుగా ఉన్న గురుకృప హైట్స్ ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతీ రోజు ఉదయం స్వామి పూజ, అర్చన, అనంతరం వాల్మీకి విరచిత సుందరకాండ రామాయణ పారాయణం, సాయంత్రం ప్రవచనాలు, సంకీర్తనలు, భజనలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామని చిన్మయ మిషన్ ప్రతినిధులు తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని రామచంద్రుని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఉత్సాహంగా గౌరీ సేవా సంఘాల ఆత్మీయ కలయిక



సమావేశమైన గౌరీ సేవా సంఘాల ప్రతినిధులు

పెదగంట్యాడ: గాజువాక నియోజకర్గంలోని అన్ని గౌరీ సేవా సంఘాల ప్రతినిధులు ఒక తాటిపైకి రావాలని గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం కార్యదర్శి పెంటకోట వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వికాస్‌నగ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గాజువాక నియోజకవర్గం పరిధిలోని గౌరీ సేవా సంఘాల ప్రతినిధులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదారి అప్పారావు, దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, గంగా భవాని, పలు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలి

మహారాణిపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం–నా హక్కు' అన్న నినాదంతో 1948 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు మంచినీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, ఆరోగ్యకరమైన ఆహారం భుజించడం చేయాలన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్లు సయ్యద్ బేగం, కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం



మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

- ప్రైవేటీకరణకు వ్యతిరేకమని చంద్రబాబు చెప్పగలరా?
- గాజువాక వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు తెగబడిన బీజేపీకి మద్దతు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఏ విధంగా ఈ ప్రాంతంలో ఓట్లు అడగడానికి వస్తారని గాజువాక వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ 76వ వార్డు నాయకుడు మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రైవేటుపరం చేస్తారన్నారు. లక్షలాది కుటుంబాలు స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉన్నాయని, వారి భవిష్యత్తును నాశనం చేసే విధంగా ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ విషయంలో చంద్రబాబు మౌనం వహించడం వెనుక కుట్ర దాగి ఉందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ప్రారంభం నుంచి వైఎస్సార్ సీపీ మద్దతు తెలుపుతూ వస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మన రాష్ట్రానికి అవసరాలు ఉన్నప్పటికీ స్టీల్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికే మద్దతు ఇస్తున్నామని తెలిపారు. నా తాత, తండ్రి రాజకీయ వారసత్వంతోనే గాజువాకలో అడుగు పెట్టానన్నారు. నాకు వ్యాపారం చేయడం రాదని, అందరికీ మంచి చేయడం మాత్రమే తెలుసన్నారు. ఉత్తరాంధ్రలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిలో భాగస్వామిని అయ్యానని, నాలుగు పోర్టులు, ఒక ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణంలో తన పాత్ర కూడా ఉందని వివరించారు. నేను చేసిన పనులు చిరస్థాయిగా మిగిలిపోవాలనే సంకల్పంతో పని చేస్తున్నానన్నారు. నేను గాజువాక నియోజకవర్గానికి చెందిన వాడినని, ఈ ప్రాంతానికి చెందిన వారికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులను చూడరని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మాత్రమే చూస్తారని, అందులోనూ పేద బడుగు బలహీన వర్గాలకు మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేస్తారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 33 రోజుల పాటు పార్టీ విజయం కష్టపడి పని చేస్తే ఐదేళ్ల పాటు మీ కోసం కష్టపడి పని చేస్తానని అమర్‌నాథ్ చెప్పారు. మాట ఇచ్చి తప్పని జగన్‌మోహన్‌రెడ్డి బాటలో తానూ నడుస్తున్నానన్నారు. ఇచ్చిన మాట తప్పితే రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ఈ ప్రాంతంలో అనేక ప్రాంతాల వారు, అనేక భాషల వారు ఉన్నారని, వారంతా ఒకే తాటిపైకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చిత్తశుద్ధితో కూడిన రాజకీయాలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ క్యాడర్‌కు, నాయకులకు సముచిత స్థానం కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, కులుకూరి మంగరాజు, బ్రహ్మానందరెడ్డి, కామేశ్వరరావు, బలగా రామారావు, తలారి నాగేశ్వరరావు, ఎంకేఎస్ మూర్తి, ఎస్.అప్పలరాజు, మంత్రి గోపీ నారాయణ, పల్లం గోపీ, యండా కృష్ణ, మునగపాక బాబూరావు, పల్లం అప్పలరాజు, శీర చిన్నారావు, కులుకూరి శ్రీనివాసరావు, నరవ శ్రీను పాల్గొన్నారు.

దేశ సంపదను అమ్మే హక్కు కేంద్రానికి లేదు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికి పెరిగిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1151వ రోజుకు చేరుకున్నాయి. పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, సీఐటీయూ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోది స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. దేశ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి అమ్మే హక్కు మాత్రం ఎవరిచ్చారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, గాజువాక సీపీఎం అసెంబ్లీ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, ఇతర పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా గాజువాక

67వ వార్డు ప్రచారంలో అమర్‌నాథ్



67వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అమర్‌నాథ్ తదితరులు

గాజువాక: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే గాజువాకను మోడల్ సిటీగా తయారు చేస్తానని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో ఆయన 67వ వార్డులోని హైస్కూల్ రోడ్డు నుంచి సింహగిరి కాలనీ ఆస్పత్రి మీదుగా ఓ ఆప్టెక్స్ ఏరియా వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందనతో తనకు కొండంత భరోసా లభిస్తోందని ప్రచారానికి నియోజకవర్గంలో ప్రజలు పెద్ద ఎత్తున సహకరిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్న తపన ప్రతి ఒక్కరిలోను కనిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్నవారు ఇస్తున్న భరోసా తనకు కొండంత బలాన్ని ఇస్తోందన్నారు. వృద్ధులు సైతం ప్రచారంలో ఉత్సాహంగా నడవడం చూస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డిపై వారికి ఉన్న అభిమానం అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా పెంటారావు, ఎస్.ఎం.డి.గౌస్, ఐ.మీరా, తిప్పల స్వాతిరెడ్డి, గొరుసు రమాదేవి, సంతోషి, విమలా థామస్, నడిగట్ల సూర్యనారాయణ, ఎ.సూర్య, గంట కామినాయుడు, అచ్చం నాయుడు, తమరాన అప్పలనాయుడు, ధనాల ఉమ, ఎం.లక్ష్మి, అన్నపూర్ణ, జోసెఫ్, దాలిరాజు, కటికల కల్పన, రామలక్ష్మి, పుష్ప, ఆశ, కోరుకొండ పద్మ, మెండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



దేవాడ పీహెచ్‌సీ వద్ద ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దని డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్ రాజా ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నా ఆరోగ్యం– నా హక్కు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నినాదం మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులు, నివారణ, చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అసంక్రమిక వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మానసిక సమస్యలు, ప్రసూతి, శిశు ఆరోగ్యం గురించి వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా మాతా శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, బంకురు గోపాలం, కాశీ దేవి, దేవి, పర్వీన్ బేగం పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు, ఇతర భక్తులు

సింధియా: కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపును ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను శాస్త్రోక్తంగా అలంకరించి వార్డులోని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూనూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలను ఈ నెల 9వ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. సోమవారం కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం అనుపమహోత్సవాన్ని మందుగుండు సామగ్రి, నేల డ్యాన్సులతో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమర్‌నాథ్



అమర్‌నాథ్‌కు మద్దతు పలుకుతున్న కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు మహిళలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. అగనంపూడి ప్రాంతం అన్నపూర్ణ నగర్‌కు చెందిన విజయలక్ష్మి, పుష్పకుమారి ఆధ్వర్యంలో సుమారు 50 మంది మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి గాజువాక వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మెచ్చి పార్టీలో చేరామన్నారు. అమర్‌నాథ్ విజయం కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తామన్నారు.

కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ చేరిక..

కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. మొల్లి చిన్న ఆధ్వర్యంలో నడుపూరులో అమర్‌నాథ్‌ను ఆదివారం ఉదయం వీరంతా కలిశారు. వీరికి అమర్‌నాథ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కొత్త అమావాస్యకు ఆలయాల సిద్ధం



ముస్తాబైన నూకాంబిక అమ్మవారు



చిననడుపూరులోని నూకాలమ్మ ఆలయం



విద్యుత్ దీపాల అలంకరణలో నడుపూరు నూకాలమ్మ ఆలయం

పెదగంట్యాడ: కొత్త అమావాస్యకు మండలంలోని నూకాలమ్మ ఆలయాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే విద్యుత్ దీపాల అలంకరణలో వెలుగులు విరజిమ్ముతున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన నూకాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరులో ఆలయ కమిటీ సభ్యుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

వెంపల్లినగర్‌లో..

జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని వెంపల్లినగర్‌లో వేంచేసియున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గల్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు చేయనున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చిననడుపూరులో..

జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని చిన నడుపూరులో నూకాలమ్మ జాతర మహోత్సవాలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు




గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యా ణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామవళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉత్సాహంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సంస్థలు బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించాయి. ఈ వాక్‌థాన్ ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం ప్రాజెక్ట్ స్మూత్వాల్క్ పేరుతో ఆర్థో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు ప్రవీణ్ రెడ్డి, ఆళ్ల లీల రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్న సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆదివారం తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.